క్లుప్తంగా

ఆలయానికి పోటెత్తిన భక్తులు

ముమ్మిడివరం: కార్తిక మాసం మూడో శనివారం కావడంతో మండలంలోని పల్లిపాలెం శ్రీహరి సాకేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు పెన్మత్స చిట్టిరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా లక్ష బిల్వార్చన



లక్ష బిల్వార్చన మహోత్సవంలో పూజ చేస్తున్న భక్తులు

అల్లవరం: మండలంలోని దేవగుప్తంలో కొలువైయున్న ఉమా సమేత మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని శనివారం లక్ష బిల్వార్చన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పోచినపెద్ది శ్యామ్ శర్మ ఆధర్యంలో గణపతి పూజ, ఏకాదశ రుద్రభిషేకం, రుద్ర హోమం, దుర్గా హోమం, జ్యోతిర్లింగార్చన, లక్ష బిల్వార్చన చేశారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

అర్చకుల వసతి గృహాలకు రూ.50 వేల విరాళం



ఆలయ చైర్‌పర్సన్ వీరీతాదేవికి విరాళాన్ని అందిస్తున్న దాతలు

అమలాపురం టౌన్: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అర్చకుల వసతి గృహాలకు పట్టణానికి చెందిన గండు బాల వెంకటేశ్వరరావు, అనంతలక్ష్మి సత్యభామ దంపతులు రూ.50 వేలు విరాళంగా సమకూర్చారు. ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవికి ఆలయంలో దాతలు రూ.50 వేల మొత్తాన్ని శనివారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి, అర్చకుల వసతి గృహాల నిర్మాణాలకు దాతలు ముందురావడంపై చైర్‌పర్సన్ వీరీతాదేవి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ఓటు నమోదు పత్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవ వర్ధన్‌రెడ్డి

అల్లవరం: స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపెయిన్‌లో ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి మండలంలోని అల్లవరం, గోడిలంక, గోడి, మొగళ్ళమూరు, తుమ్మలపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులు 3వ తేదీలోగా ఓటుని నమోదు చేసుకోవాలన్నారు. అలాగే డబుల్ ఎంట్రీ ఓట్లని తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివప్రసాద్, ఆర్ఐ దుర్గా శ్రీను, బీఎల్ఓలు పాల్గొన్నారు.

వితరణశీలి నాగమణికి సత్కారం



నాగమణిని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పలు వితరణ కార్యక్రమాలు చేస్తున్న పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు కూచిమంచి నాగమణిని శనివారం స్థానిక కూచిమంచి అగ్రహారంలో మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించి అభినందించారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి మాట్లాడుతూ ప్రతీనెలా స్థానిక హరి మనో వికాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు అల్పాహారం, భోజనం ఏర్పాటుతో పాటు లూయీ అంధుల పాఠశాలకు, ఆరుగురి పేద మహిళలకు నిత్యావసర సరకులు సమకూర్చుతారంటూ నాగమణి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు యర్రమిల్లి అనంతలక్ష్మి, దువ్వూరి సుబ్బలక్ష్మి, పేరి లలిత, బులుసు కామేశ్వరి, పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

చి‘వరి’లో రైతన్నల కష్టాలు

- ముంచుకొస్తున్న తుపాను గండం
- పంట ఒబ్బిడికి అష్టకష్టాలు

తాళ్లరేవు/ఐ.పోలవరం: తుపాను హెచ్చరికలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో మిచాంగ్ తుపాను ముంచుకు రావడంతో రైతన్నలకు కంటిమీద కునుకు లేకుండాపోయింది. ఈ ఏడాది పంటలు బాగా పండడంతో మంచి ఆదాయం వస్తుందనుకుంటున్న తరుణంలో తుపాను కారణంగా ఏమవుతుందోనని రైతులు కంగారు పడుతున్నారు.

కలవరపరుస్తున్న వాతావరణం

కోతలు ప్రారంభమయ్యే సరికి వాతావరణ మార్పులు సంభవించడంతో గత మూడు రోజుల నుంచి మబ్బులు కమ్ముకుని వివిధ మండలాల్లో ఒక మోస్తారు వర్షాలు, చిరు జల్లులు కురవడం రైతులను కలవరపరుస్తుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడి తీవ్ర తుపానుగా మారిందని దీని ప్రభావంతో కోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని అధికారులు చెప్పడంపై రైతులు అప్రమత్తమయ్యారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాల కారణంగా పంటను ఒబ్బిడి చేసేందుకు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా ఎండలు బాగా కాయడంతో చాలా మంది రైతులు మాసూళ్లు చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో విత్తనాల వరిని కోతలు చేపట్టగా, మరికొంత మంది రైతులు వరికోత మిషన్ల ద్వారా మాసూళ్లు చేస్తున్నారు. అయితే తుపాను ప్రభావంతో వర్షాలు కురిస్తే వరి



తాళ్లరేవులో ఈదురుగాలులకు నేలకూలిన వరి చేలు

పంట మొలకలు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో సుమారు 30 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 50 శాతం మేర కోతలు పూర్తయ్యాయి. అధికశాతం మంది వరికోత మిషన్ల ద్వారా మాసూళ్లు చేస్తున్నారు. కోసిన ధాన్యంలో తేమ శాతం అధికంగా ఉండడంతో దానిని తగ్గించేందుకు రహదారులపై ధాన్యాన్ని అష్టకష్టాలు పడి ఆరబెడుతున్నారు. మాసూలు చేసిన ధాన్యం తడిసిపోకుండా ధాన్యం రాశులపై భారీ టార్పాలిన్‌లు వేసి భద్రత కల్పిస్తున్నారు. ఈ సమయంలో పడే వర్షాలు వల్ల అవి ముక్కిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి వరుసగా మూడు రోజుల పాటు వర్షాలు పడతాయని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు.



పాతయింజరంలో వరికోత యంత్రంతో సాగుతున్న కోతలు

తుపాను వస్తే నష్టాలే



ఈ ఏడాది పంటలు బాగా పండాయి. వరి పంటను మాసూలు చేసుకుందామనుకుంటున్న తరుణంలో తుపాను వస్తుందని హెచ్చరికలు రావడంతో ఏం చేయాలో తెలియడం లేదు. గత రెండేళ్లుగా ఏదో విధంగా పంటను కోల్పోతున్నాం. ఈ ఏడాదైనా పంటను ఒబ్బిడి చేసి అప్పులను తీర్చుకుందామంటే తుపాను కారణంగా పంట చేతికి వస్తుందో రాదో తెలియడం లేదు.

– కనకాల రామకృష్ణ, రైతు, చొల్లంగి పంచాయతీ

రైతులు జాగ్రత్తలు పాటించాలి



తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు మరి కొన్ని రోజుల పాటు కోతలను వాయిదా వేసుకోవాలి. కోసిన పంటను పొలాల నుంచి తక్షణమే పొడి ప్రదేశాలకు లేదా గోదాములకు చేర్చాలి. పాక్షికంగా ముదిరిన పంటల్లో వర్షపు నీరు పోవడానికి కాలువలను ఏర్పాటు చేయాలి. పైరు గాలికి పడిపోకుండా 4, 5 దుబ్బులను కలిపి కట్టలుగా కట్టుకోవాలి.

– ఎస్.ప్రశాంతి, వ్యవసాయ అధికారి, తాళ్లరేవు మండలం

వలంటీర్ల కార్తిక వన సమారాధన

తాళ్లరేవు: మండలంలోని గ్రామ వలంటీర్ల కార్తిక వనసమారాధన కార్యక్రమం శనివారం జి.వేమవరం పంచాయతీలోని సన్ వ్యాలీ లేఅవుట్‌లో ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరంతరం ప్రజలకు చేరవేస్తున్న వలంటీర్లను అభినందించారు. వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. అనంతరం ఆయన స్వయంగా వలంటీర్లకు వనభోజనాలను వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్, మహిళా అధ్యక్షురాలు రేవు మల్లీశ్వరి, కొపనాతి నాగరాజు, మోకా మధుబాబు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన

ఉప్పలగుప్తం: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తూ కూనవరం, కిత్తనచెరువు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు ఆయుష్మాన్ హెల్త్ కార్డులను లబ్ధిదారులకు అందించారు. భీమనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు కె.విష్ణుప్రియ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వాకపల్లి ఈశ్వరి, కుంచే గౌరీ, ఎంపీటీసీ సభ్యురాలు కాట్రు ధనలక్ష్మి, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి, కార్యదర్శి రామలక్ష్మి, ఆకుల చిన్ని, కాట్రు కృష్ణ, దేవరపల్లి నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి



వాసాలతిప్పకు చెందిన లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న మంత్రి విశ్వరూప్

రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్

అమలాపురం రూరల్: పేదలకు సీఎం సహాయ నిధి వరం లాంటిందని రాష్ట రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం భట్నవెల్లిలో మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం పలువురికి సీఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.6.50 లక్షల విలువైన చెక్కులను మంత్రి విశ్వరూప్ లబ్ధిదారులకు ఇచ్చారు. జనుపల్లి గ్రామానికి చెందిన నల్లమిల్లి అనంత లక్ష్మికి రూ.1.30 లక్షల చెక్కు, అయినవిల్లి మండలం ముక్తేశ్వరం గ్రామానికి చెందిన నాగబత్తుల వెంకటస్వామికి రూ.60 వేలు, అమలాపురం చెందిన బొల్లోజు శ్రీనివాస్‌కు రూ.1 లక్ష, ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్పకు చెందిన కర్రి సత్తి పండుకు రూ.3 60 లక్షల చెక్కును మంత్రి విశ్వరూప్ అందజేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి, కట్టోజు రాము, ఉంద్రు బాబ్జి, ఈతకోట శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

చొల్లంగిలో భూముల పరిశీలన

తాళ్లరేవు: నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు చొల్లంగిలోని భూములను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శనివారం పరిశీలించారు. ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన పేదలకు ప్రభుత్వ స్థలాలను ఇచ్చేందుకు చొల్లంగిలో స్థలాలను చూశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బూరెల వెంకట్రాజు, చొల్లంగిపేట మాజీ సర్పంచ్ మైదు హరిబాబు తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

తాళ్లరేవు: మండలంలోని జి.వేమవరం పంచాయతీ పరిధిలోని అడివిపూడి, రామాలయంపేట గ్రామాల్లో నిర్మించనున్న కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి సభ్యుడు, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. ఓఎన్‌జీసీ, సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలు, జీజీఎంపీ నిధులు రూ.10 లక్షల వ్యయంతో అడవిపూడిలో బీసీ కమ్యూనిటీ హాల్, రామాలయంపేటలో రూ.5 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఓసీ కమ్యూనిటీ హాలు నిర్మించేందుకు ఎమ్మెల్యే పొన్నాడ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎంపీటీసీ సభ్యుడు యర్రంనీడి అప్పారావు, మట్టా లింగమూర్తి, కోట వెంకటలక్ష్మి, అన్నవరం, సందాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



చొల్లంగిలో భూములను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్



అడివిపూడిలో బీసీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

కొబ్బరి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

అమలాపురం టౌన్: కొబ్బరి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, ఇప్పటికే అసెంబ్లీలో రెండుసార్లు కొబ్బరి కార్మికుల సమస్యలపై చర్చించానని ముమ్మిడివరం ఎమ్మెల్యే, కొబ్బరి ఒలుపు, దింపు కార్మికుల సంఘం రాష్ట గౌరవాధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. సంఘానికి చెందిన ప్రతినిధుల బృందం అమలాపురంలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద ఎమ్మెల్యే పొన్నాడను శనివారం కలిశారు. 50 ఏళ్లు నిండిన కొబ్బరి ఒలుపు, దింపు కార్మికులకు పింఛన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను సంఘం రాష్ట అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు అభ్యర్థించారు. సంఘ పరిధిలో దాదాపు 600 మంది 50 ఏళ్లు దాటిన కార్మికులు ఉన్నారని తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

యానాం చేరుకున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం



తుఫానుపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: మిచాంగ్ తుఫాను తరుముకొస్తున్న నేపథ్యంలో దానిని ఎదుర్కొనేలా తీసుకోవాల్సిన రక్షణాత్మక చర్యలపై ఆర్ఏఓ మునిస్వామి అధ్యక్షతన ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి కలెక్టర్ వల్లవన్ వర్చువల్ పద్ధతిన అధికారులతో మాట్లాడారు. ఈ నెల 4వ తేదీ సోమవారం తుఫాను తీరం దాటనున్న నేపథ్యంలో తీరప్రాంత గ్రామాలైన గిరియాంపేట, సావిత్రినగర్, దరియాలతిప్ప, అయ్యన్ననగర్, పరంపేట తదితర ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై మాట్లాడారు. ఇప్పటికే విజయవాడ నుంచి 20 మందితో కూడిన ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యుల బృందం యానాం చేరుకుందన్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

యానాం తీరప్రాంత మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. తుఫానును ఎదుర్కొనేలా సహాయ చర్యలకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఆర్టీసీ గిఫ్ట్ స్కీం విజేతలకు బహుమతుల అందజేత

అమలాపురం రూరల్: ఆర్టీసీ అమలాపురం డిపోలో రాజమండ్రి, ఓడలరేవు పలె బస్సులో ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీం పథకంలో నవంబరు రెండో పక్షం లక్కీ డిప్ డ్రా శనివారం తీసి విజేతలకు బహుమతులు అందించారు. మాజీ ఎంపీపీ పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సౌజన్యంతో బహుమతులను అందచేశారు. మండపేటకు చెందిన సీహెచ్ చిన్నా ప్రథమ, అంబాజీపేటకు చెందిన బుజ్జి ద్వితీయ బహుమతి, ఓడలరేవు రూటులో ఓడలరేవుకు చెందిన నర్సమూర్తి ప్రథమ, జగన్నాథరావుకు ద్వితీయ బహుమతులు గెలుపొందారు. విజేతలను అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి అభినందించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ప్రతిమాకుమారి, ఓపీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వరహాలబాబు, సెక్యూరిటీ ఇన్‌చార్జ్ రామారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

అల్లవరం: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. కోడూరుపాడు పంచాయతీ పరిధిలోని పాటివారిపాలెంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఉంద్రు సుదర్శనరావు అధ్యక్షతన పొలంబడి క్షేత్ర దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ నూతన వరి సాగు పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధ్యమన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, ఏఎంసీ డైరెక్టర్ పాటి శ్రీరామ్, గ్రామకమిటీ అధ్యక్షుడు జల్లి శ్రీను, వ్యవసాయ సహాయకులు శ్రావణి, శివరామ్, మణికంఠ పాల్గొన్నారు.



పొలంబడి క్షేత్ర దినోత్సవం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

ప్రత్యేకాధికారుల నియామకం

యానాం: మిచాంగ్ తుఫాను నేపథ్యంలో తీరగ్రామాల్లో రక్షణ చర్యలకు, బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడం తదితర సహాయక చర్యల కోసం మున్సిపల్ కమిషనర్ అరుశ్ ప్రకాశం, ఎస్పీ రఘునాయగం, జీజీహెచ్ డీడీ రవిశంకర్, ఏఈ నాగరాజు, విద్యుత్ ఏఈ లంక కృష్ణారావు, డీటీ దండపాణి, ఫిషరీస్ ఏడీ గొంతియ్య, సివిల్ సప్లయిస్ ఆఫీసర్ పి.వినోద్ కుమార్, సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, ఏడీ వెల్ఫేర్ కొంకే రవికుమార్, విద్యాశాఖాధికారి పీఎల్ ప్రవీణ్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. అత్యవసర పరిస్థితుల్లో ఆర్ఏఓ ఆఫీసులో ఏర్పాటుచేసిన కంట్రోల్‌రూమ్‌కు 99944 90170, 0884-2325105, 2321223, టోల్‌ఫ్రీ నెంబరు180042 52303 నెంబర్లలో సంప్రదించొచ్చని ఆర్ఏఓ మునిస్వామి తెలిపారు.

కన్నుల పండువగా కల్యాణ మహోత్సవం

ముమ్మిడివరం: మండలంలోని పల్లిపాలెం శ్రీహరి సాకేత వేంకట్వేరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీభాద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సుబ్బారావు, తేజ, పురోహితులు బ్రహ్మశ్రీ నాగాభట్ల రామకృష్ణమూర్తిల ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు పెన్మత్స చిట్టిరాజు దంపతులు సమర్పించిన పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ చేతుల మీదుగా స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గ్రామాల్లో హిందూ ధర్మ ప్రచార కార్యక్రమంలో భాగంగా స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు. సర్పంచ్ కాశే రాజబాబు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కొలిశెట్టి గంగబాబు తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

అప్రమత్తంగా ఉండాలి



కోడూరుపాడులో రైతులకు సూచనలిస్తున్న తహసీల్దార్ సాంబశివప్రసాద్

అల్లవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో కోస్తాంధ్రలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సాంబశివప్రసాద్ అన్నారు. శనివారం ఆయన వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణతో కలిసి కోడూరుపాడులో పర్యటించారు. వరి కోతలు పూర్తి చేసిన రైతులు ఒబ్బిడి చేసుకుని బరకాలు కప్పుకోవాలని సూచించారు. కళ్లాల్లో ధాన్యం ఉంటే మెరక ప్రాంతాలకు తరలించాలన్నారు. భారీ గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు. అనంతరం అధికారులతో తుఫాన్‌పై సమీక్ష నిర్వహించారు.

ఏపీ జేఏసీ మహిళా విభాగ కార్యవర్గం నియామకం



ఏపీ జేఏసీ మహిళా విభాగం నూతన కార్యవర్గం

ముమ్మిడివరం: స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ జేఏసీ కోనసీమ జిల్లా మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ డి.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ జి.చిరంజీవి అధ్యక్షతన శనివారం ఎన్నుకున్నారు. జిల్లా జేఏసీ చైర్‌పర్సన్‌గా అయినవిల్లి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ప్రధాన కార్యదర్శిగా జి.కనకదుర్గలను నియమించారు. కోనసీమ జిల్లా 4వ తరగతి ఉద్యోగ జేఏసీ నిర్మాణం అధ్యక్షుడిగా కొప్పు సూరిబాబు, ప్రధాన కార్యదర్శిగా జోగి గుణ్ణప్పలను నియమించారు. కార్యక్రమంలో రాష్ట అసోసియేట్ చైర్మన్ ఫణి పేర్రాజు, రాష్ట మహిళా విభాగం చైర్‌పర్సన్ లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి, అసోసియేట్ చైర్మన్ కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేతో పక్కాగా రిజర్వేషన్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు

అల్లవరం: జనాభాపరంగా రిజర్వేషన్ ఫలాలు పూర్తి స్థాయిలో వర్తించాలంటే కుల గణన సర్వే తప్పనిసరి అని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కుల పెద్దలతో కుల గణన సర్వేపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట ప్రభుత్వాలు కులాల పరంగా జనాభాను లెక్కించే కార్యక్రమం చేపట్టారని తెలిపారు. ఎప్పటి నుంచో కుల గణ సర్వే చేయాలన్న డిమాండ్‌ని రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సర్పంచ్‌లు సాధనాల వెంకటరావు, బొమ్ము బాలవేణి, రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీలు ఎస్.మౌనిక, సీహెచ్ లిల్లీ, గుబ్బల బాబ్జి, పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, మాకే కృష్ణమూర్తి, పి.రాజేశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, ఎంపీడీఓ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక ఈదరపల్లి వంతెనకు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, సీనియర్ నాయకుడు చీకట్ల అబ్బాయి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల సుభాషిణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి, జిల్లా పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, పీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ దేవరపల్లి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు సాహిత్య ఉత్సవాలకు ఆహ్వానం

అయినవిల్లి: 21 ప్రపంచ రికార్డులను సాధించిన సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 16 17 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం బుద్దాల కన్వెన్షన్ హాలులో నిర్విరామంగా జరగబోయే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు అయినవిల్లి మండలం మాగం గ్రామానికి చెందిన వీధి దుర్గారావు మాస్టారుకి ఆహ్వానం అందింది. ఈ మేరకు శనివారం దుర్గారావు స్థానిక విలేకరులకు ఓ ప్రకటనలో తెలిపారు. దుర్గారావు జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాల చింతనలంకలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. తాడేపల్లిగూడెంలో 30 గంటల 30 నిమిషాల 30 సెకన్ల పాటు జరుగబోయే సకల కళా ప్రదర్శనల్లో మాస్టారు తమ కవితాగానం చేయనున్నారు. గతంలో 12 గంటల 12 నిమిషాల 12 సెకన్ల పాటు మలికిపురంలో మరియు 48 గంటల పాటు తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగిన ప్రపంచస్థాయి కళాఉత్సవాల్లో దుర్గారావు మాష్టారు పేరు పలు ప్రపంచ రికార్డుల్లో నమోదయింది.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

మలికిపురం: కాకినాడ జేఎన్టీయూలో జరిగిన క్రియా పిల్లల పండగలో రాష్ట్రస్థాయి పోటీలలో మేడిచర్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుమతులు గెలుచుకున్నట్లు హెచ్ఎం కె.సాయిబాబు శనివారం తెలిపారు. పోస్టల్ ప్రెజెంటేషన్‌లో సీనియర్, జూనియర్ విభాగంలో మట్టితో బొమ్మలు సీనియర్ విభాగంలోను, మ్యాథ్స్ ప్రాజెక్ట్ సీనియర్ విభాగంలో నలుగురు విద్యార్థులు ప్రథమ బహుమతులు, క్రాఫ్ట్ సీనియర్ విభాగంలోను, కథ చెప్పడం జూనియర్ విభాగంల్లో, బుర్రకథలో సీనియర్స్ విభాగంలోను ముగ్గురు ద్వితీయ బహుమతులు, బుర్రకథలు జూనియర్స్, సబ్‌జూనియర్స్ విభాగాల్లో ఇద్దరు తృతీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. కాగా గెలుచుకున్న విద్యార్థినులకు అభినందన సభ జరిగింది. ఎంఈవో-1 ఎం.విజయశ్రీ, ఎంఈవో-2 వైవీ సత్యనారాయణ, సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి, మేడిచర్ల రామలింగేశ్వరరావు, ఎంపీటీసీ ముత్యాల సాయిరాం ,పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.దుర్గాప్రసన్న పాల్గొన్నారు.



మేడిచర్లపాలెం జెడ్పీ పాఠశాలలో అభినందనలు అందుకున్న విద్యార్థినులు